
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

ఆదివారం 23 నవంబరు 2025

బాధిత కుటుంబానికి కేటీఆర్ భరోసా

ఎల్లారెడ్డిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని నిరుపేద దంపతులు నీరంక లత-రవి కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ భరోసా కల్పించారు. ఆ దంపతుల వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష అందిస్తానని శనివారం ప్రకటించారు. ఇటీవల సిరిసిల్ల పర్యటనలో భాగంగా బాధితులు తమ గోడును కేటీఆర్‌తో వెల్లబోసుకున్నారు. స్పందించిన ఆయన ఆదుకుంటానని హామీ ఇచ్చారు. దంపతుల వైద్యానికి లక్ష రూపాయలు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. కేటీఆర్‌కు బాధితులు లత- రవిలు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీలకు నజరానా..



- 'ఏకగ్రీవం'పై మళ్లీ ఆశలు
- ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10 లక్షల ప్రోత్సాహం
- గత ప్రభుత్వంలో రావాల్సిన బకాయిలు రూ.4.10 కోట్లు
- జిల్లాలో ఏకగ్రీవాలపై అనాసక్తి
- నేడు తుది ఓటరు జాబితా వెల్లడి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పంచాయతీ ఎన్నికలకు త్వరలోనే నోటిఫికేషన్ రానున్నది. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించడానికి కసరత్తు మొదలైంది. పాత పద్ధతిలో 50 శాతం కోటా మించకుండా రిజర్వేషన్లు ఖరారు చేయడమే కాకుండా ఆదివారం సవరణతో కూడిన తుది ఓటర్ జాబితా వెల్లడి కానున్నది. పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా పల్లెల్లో ఎన్నికల్లో పోటీకి సిద్ధమైన ఆశావహుల హడావుడి జోరందుకుంది. ప్రభుత్వం డిసెంబరులో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసే విధంగా చురుకుగా ఏర్పాట్లు చేస్తోంది. వివిధ రాజకీయ పార్టీలు కూడా స్థానిక ఎన్నికలపై దృష్టి పెట్టడంతో పల్లెల్లో రాజకీయ సందడి మొదలైంది.

పంచాయతీ ఎన్నికల్లో పదవులు కైవసం చేసుకోవాలని ఆశతో ఉంటే గ్రామాల్లో మంత్రి తుమ్మల మాటలతో మరోసారి ఏకగ్రీవ పంచాయతీల చర్చకు దారితీసింది. గత ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏకగ్రీవ ఆశలు ముందుకు తీసుకొచ్చింది. వ్యవసాయ, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిషత్, పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ద్వారా పల్లెలు సజావుగా అభివృద్ధి చెందుతాయని, ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం రూ 10 లక్షలు ప్రోత్సాహం ఇస్తుందని వెల్లడించారు.

కానీ రాజన్న సిరిసిల్ల జిల్లాలో పల్లెల్లో ఏక గ్రీవాలపై అంతగా ఆసక్తి చూపడం లేదు. గత ప్రభుత్వ హయాంలో 2019 ఎన్నికల్లో ఏకగ్రీవ పంచాయతీలకు రూ 10 లక్షలు ప్రోత్సాహం ఇస్తామని మంత్రులు ప్రకటించారు. పదవీ కాలం ముగిసినా రూ 10 లక్షల ప్రోత్సాహం మాత్రం రాలేదు. సర్పంచ్, పాలకవర్గం ఏకగ్రీవ నిధులు, ప్రభుత్వం అందించే నిధులతో బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు ఉండవని భావించి అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసిన వారికి నిరాశే మిగిలింది. బిల్లులు రాక, కనీసం అందిస్తామన్న ప్రోత్సాహం నిధులు లేక అప్పుల పాలయ్యారు.

జిల్లాలో 2019 ఎన్నికల్లో 41 పంచాయతీలు ఏకగ్రీవం..

గ్రామాభివృద్ధికి నిధులు ఉపయోగపడుతాయని ఊరంతా ఒక్కటై గ్రామపంచాయతీ పాలకవర్గాలను ఏకగ్రీవం చేసుకున్నారు. 2019 గ్రామపంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసిపోయిన నిధులు మాత్రం విడుదల కాలేదు. జిల్లాలో ఎకగ్రీవమైన గ్రామ పంచాయతీలు 41 ఉండగా వీటికి ప్రోత్సాహం కింద రూ.4.10 కోట్లు రావాల్సి ఉంది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ప్రోత్సాహం కింద ప్రభుత్వం రూ.7 లక్షలు అందజేస్తే దీనిని తెలంగాణ ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు.

2023 శాసనసభ ఎన్నికల సమయంలో ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని ఆశగా ఎదురు చూశారు. నిధులు విడుదల కాకపోగా ప్రభుత్వం మారడంతో నిధులు ఊసే లేకుండా పోయింది. మరోవైపు గ్రామపంచాయతీల్లో చేసిన పనులకు బిల్లులు రాక ఒకవైపు సొంతంగా డబ్బులు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేసిన సర్పంచ్‌లు ఏకగ్రీవ నజరానా వచ్చినా ఉపశమనం లభిస్తుందని భావించి నిధులు రాకపోవడంపై పల్లెల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమయింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2019 జనవరిలో పంచాయతీ

మిగతా 8లో..

బాల్యవివాహాలను అరికట్టడానికి ముందుకురావాలి

- జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

సిరిసిల్ల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాలను అరికట్టడంలో యువత ముందుకు రావాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మీరాజం యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలని, డ్రగ్స్‌వలన కలిగే చెడు ప్రభావాల గురించి లక్ష్మీరాజం వివరించారు. చిన్నవయస్సులో వివాహాలు చేయడం వల్ల అనేక మార్పులు జరగడంతోపాటు పిల్లలకు ఇబ్బందుకలు గురవుతున్నారని, బాల్యవివాహాలను అరికట్టడంతో యువత చొవవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్మెంట్ కో-ఆర్డినేటర్ రోజా, టీమ్ సభ్యులు జనార్ధన్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి లత

ఎల్లారెడ్డిపేట, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకుని అన్నదాతలు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి లత అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారి లత మాట్లాడుతూ రైతులను లాభాల బాటలో నడిపించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని అన్నారు. ఆయిల్‌పామ్ పంటను సాగు చేసేందుకు అన్నదాతలను ప్రోత్సాహిస్తోందని అన్నారు. రాయితీని అందిస్తోందించి పంట విక్రయాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతోందని అన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి, లాభాలు వచ్చే ఆయిల్ పామ్ పంటను సాగు చేయాలని అన్నారు. సాగు విధానం, దిగుబడి, విక్రయాలు, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్‌బేగం, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, అధికారులు లోకేష్, సలావుద్దీన్, ముకుంద్‌కుమార్, ప్రేమ్‌సాయి, సంఘం డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సంగీతం శ్రీనివాస్



సంగీతం శ్రీనివాస్

సిరిసిల్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా సంగీతం శ్రీనివాస్‌ను నియమిస్తూ శనివారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాస్ కాంగ్రెస్‌లో సామాన్య కార్యకర్తగా తన ప్రస్థానం ప్రారంభించారు. 1982లో యుజన కాంగ్రెస్ నుంచి పార్టీలు మారకుండా అంకితభావంతో కాంగ్రెస్ పార్టీలో పని చేస్తూ జిల్లా అధ్యక్ష పదవి వరకు చేరుకున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్ ఉమ్మడి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా, ఓబీసీ రాష్ట్ర కమిటీ, పీసీసీ సభ్యుడిగా పని చేశారు. సిరిసిల్ల మార్కెట్ కమిటి చైర్మన్‌గా, పది సంవత్సరాల పాటు సిరిసిల్ల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశారు. చొప్పదండి, పెద్దపల్లి, మానకొండూరు నియోజకవర్గం ఇంచార్జిగా పని చేశారు. సంగీతం శ్రీనివాస్ జిల్లా అధ్యక్షుడిగా నియమించిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సామాన్య కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు గుర్తింపు ఉంటుందని అన్నారు. సమర్థతను పార్టీ గుర్తించిందని అన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

కోనరావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి సందీప్ హెచ్చరించారు. రబీ సీజన్ సాగుపై వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో కోనరావుపేట మండలం నిజామాబాద్ రైతు వేదికలో శనివారం డీలర్లకు, రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా రశీదు తీసుకోవాలని తెలిపారు. అనుమతిలేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎఈఓ పద్మ, డీలర్లు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి చీరలు — మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక..



చీరలు అందిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

సిరిసిల్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ నేత కార్మికులు తయారుచేసిన ఇందిరా మహిళా శక్తి చీరలు రాష్ట్రంలోని మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్నాయని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో సిరిసిల్ల నియోజకవర్గంలోని మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మతుల పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండోరోజు నుంచే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు మహిళల పేరిట ఇస్తున్నామని వివరించారు. ప్రతి ప్రభుత్వ పథకం అమలులో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. వారి ఆర్థిక ప్రగతితో రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఉద్దేశ్యంతో పథకాలకు రూపకల్పన చేస్తున్నారన్నారు. సిరిసిల్లలో ఇందిరా మహిళాశక్తి చీరలు తయారై రాష్ట్ర మంతా పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. సిరిసిల్లలో 130మ్యాక్స్ సొసైటీలు, ఆరువేల మంది కార్మికులకు ఉపాధి లభించిందని వెల్లడించారు. అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్లు స్వరూపారెడ్డి, విజయ, సాబేరబేగం, రాణి, చైర్మన్ రాములు నాయక్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, డీఆర్డీవో శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి వ్యవసాయమార్కెట్ యార్డులో ఆధునిక వసతుల కల్పన కోసం లక్షల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు శిలాఫలకాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేస్తుందన్నారు. రైతు సంక్షేమ ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, రైతులకు ఆధునిక వసతుతో మార్కెట్ యార్డులో పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముందు గంటి సురేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయినీ ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి, సింగల్ విండో చైర్మన్ దుర్గారెడ్డి, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో జయశీల, ఏపీవో ప్రణీత, ఎంపీవో శ్రీధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సంభ లక్ష్మీరాజం, ఏనుగుల కనకయ్య, నాగుల వంశీ, ఏమిరెడ్డి సురేందర్‌రెడ్డి, జోగు రవీందర్, జంగం అంజయ్య, కొమ్మనబోయిన సువిన్‌యాదవ్, జంగ సత్యం తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : ఎస్పీ



ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

సిరిసిల్ల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం శ్రమించే పోలీసులు తమ వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఎస్పీ మహేష్ బీ గితే కోరారు. సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు శరత్ మ్యాక్స్ విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ఎస్పీ మహేష్ బీ గితే ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు ఎస్పీ సైతం కంటి పరీక్షలను చేయించుకున్నారు. అనంతరం జరిగి సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం సేవలందించే పోలీసులు ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి మెరుగైన సేవలు అందించగలరని, ఆరోగ్య పరిరక్షణ కోసం పోలీసులు వైద్య పరీక్షలకు సమయాన్ని కేటాయించాలన్నారు. విధి నిర్వహణకు అంకితమైన పోలీసులతో పాటు వారి కుటుంబ సభ్యులు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసస్తున్నామని, ఈ శిబిరాలను పోలీసులు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో కంటి వైద్యుల బృందం పాల్గొని కంటి ఆరోగ్య పరిశీలన దృష్టి సమస్యల నిర్ధారణ, అవసరమైన మందులు సూచనలు అందించారు. రోజు వారీ ఒత్తిడి ఫీల్డ్ పనులు, రాత్రిపూట డ్యూటీ కారణంగా కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇలాంటి శిబిరాలు పోలీస్ సిబ్బందికి ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, సీఐలు మొగిలి, శ్రీనివాస్, రవి, నాగేశ్వర్‌రావు, మధుకర్, ఆర్ఐలు మధుకర్, రమేష్, యాదగిరి, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

ఇల్లంతకుంట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పోరాటాల ద్వారా కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని హమాలీ సంఘ జిల్లా అధ్యక్షుడు సావనపెల్లి రాములు పేర్కొన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో శనివారం సీఐటీయూ మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈనెల30న జిల్లాకేంద్రంలో జరిగే సీఐటీయూ నాలుగవ జిల్లా మహాసభలకు అన్ని గ్రామాల కార్మికులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పసుల బాబు, యాదగిరి, ఎర్ర బాబు, నాగరాజు, చంద్రం, శ్రీనివాస్, భూమేష్, బట్టు సురేష్, బట్టు నరేష్, ఉదయ్, ఇల్లందుల శేఖర్, రమేష్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయ దక్షిణ ప్రాకారం కూల్చివేత - శరవేగంగా విస్తరణ పనులు 7

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం.. - ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ 8

ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయాలి

- సిరిసిల్లలో వామపక్షాల నిరసన



సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అడవులు, అటవీసంపదను బడా కార్పొరేటులకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం వామపక్షాల ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలంటూ వామపక్షాల నాయకులు నిరసలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు బోజ్జ కనుకయ్య, సీపీఐ జిల్లా నాయకులు గుంటివేణు, పంతం రవి, మీసం లక్ష్మణ్, సోమనాగరాజు, మంత్రి చంద్రన్న, పోకల సాయికుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఎలిగేటి రాజశేఖర్, అంగూరి రంజిత్, వజ్రక్క, రాజేశ్వరీ, గజ్జెల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తండ్రిని చంపిన తనయుడి అరెస్టు

● వివరాలు వెల్లడించిన సీఐ



చందు అరెస్టు చూపుతున్న సీఐ మొగిలి, ఎస్సై గణేశ్

ముస్తాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తండ్రిని చంపిన తనయుడిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో రూరల్‌సీఐ మొగిలి వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామానికి చెందిన పిట్టల దేవయ్య(60) ఇంట్లో ఒంటిపై గాయాలతో అనుమా నాస్పద స్థితిలో చనిపోయడని దేవయ్య తమ్ముడు పిట్టల లక్ష్మయ్య గత అగస్టు నెలలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. పోస్టుమార్టం, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టుల ప్రకారం దేవయ్యను ఊపిరాడకుండా చేసి చంపినట్లుగా తేలడంతో మృతుడి కుమారుడు పిట్టల చందు(42)ను విచారించారు. దేవయ్య, చందులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండేళ్ల క్రితం తన కొడుకు ఆరోగ్యం బాగాలేదని ఎకరం భూమిని తండ్రి దేవయ్య వద్దన్నా చందు అమ్మాడు. నాటి నుంచి చందుతో మాట్లాడకుండా పక్క ఇంట్లో కిరాయి తీసుకుని దేవయ్య నివాసం ఉంటున్నాడు. ప్రతి రోజు తాగి వచ్చి చందును, చందు తల్లిని ఎందుకు భూమి అమ్మారంటూ దేవయ్య గొడవకు దిగేవాడు. గత ఆగస్టు 10న రాత్రి బెల్టుషాపు ముందర తాగి గొడవ చేస్తుండగా, అక్కడికి వెళ్లి చందు వారించే యత్నం చేయగా దేవయ్య కిందపడిపోయాడు. తర్వాత దేవయ్యను చందు ఇంట్లోకి తీసుకువచ్చాడు. తాగిన ప్రతిసారి గొడవకు దిగుతున్నాడని తండ్రి దేవయ్యను చందు ఊపిరి ఆడకుంగా చేసి కుమారుడు హత్య చేశారు. తరువాత తండ్రి రూం వద్ద పడుకోబెట్టి తనకేం తెలియదన్నట్లు తెల్లవారి కూలి పనికి వెళ్లాడు. తెల్లావారి దేవయ్య తమ్ముడు లక్ష్మయ్య గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు విచారణ ప్రారంభించగా కన్న కొడుకే హంతకుడని తేలింది. చందును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై సీహెచ్ గణేశ్, పీసీలు ఖాసిం పాల్గొన్నారు.

పంట మార్పిడి దిశగా అడుగులు



వరిపొలంలో సాగుచేసిన మొక్కజొన్న పంట

- జీరోటిల్లేజ పద్ధతిలో పొలాల్లో కొయ్యమక్క సాగు
- పంటల్లో తెగుళ్ల తగ్గుదలకు అవకాశం
- ఆరుతడి పంటలతో ఆదాయం పెంపునకు చర్యలు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పంట మార్పిడి దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో యాసంగి సీజన్ ఆరంభం అవటంతో వరిస్థానంలో మొక్కజొన్న పంట సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మొక్కజొన్నకు రూ. 2,400 మద్దతు ధర రాష్ట్ర ప్రభుత్వం కల్పించడంతో రైతులు నిర్భయంగా మొక్కజొన్నపంట సాగు వైపు దృష్టిని సారిస్తున్నారు. దీనికి తోడు వరికి బదులుగా మక్క సాగు చేయడంతో నేలలో తెగుళ్ల తగ్గి దిగుబడి పెరిగే అవకాశం ఉండడంతో రైతులు పంట మార్పిడిపై ఆసక్తిగా ముందుకు సాగుతున్నారు.

సాగు రెట్టింపు అయ్యే అవకాశం..

జిల్లాలో యాసంగిలో అన్ని పంటల సాగు విస్తీర్ణం నాలుగున్నర లక్షల ఎకరాల వరకు ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో భాగంగా గతంలో 35వేల ఎకరాల్లో సాగయ్యే మక్క సాగు ఇప్పుడు రెట్టింపు అయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. వరి పండించిన పొలాల్లో దుక్కి దున్నకుండానే జీరో టిల్లేజి పద్ధతిలో కొయ్యమక్క సాగుచేసి ఖర్చులు తగ్గించుకుంటున్నారు జిల్లా రైతులు. వరుస క్రమంలో తాళ్లు కట్టి, మక్కలను విత్తుతున్నారు. తదనంతరం కలుపు నివారణకు గడ్డిమందును పిచికారి చేస్తున్నారు.

మొక్కజొన్న సాగుతో దిగుబడి అధికం..

వేసవికాలంలో ఉష్ణోగ్రతలు పెరగుతుండడం, వాతావరణ పరిస్థితులు సైతం అనుకూలంగా ఉండడంతో మొక్కజొన్న దిగుబడి పెరిగే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధరకు మక్కలను కొనుగోలు చేయడంతో రైతులు సాగుకు మరింత ఆసక్తిని కనబరుస్తు న్నారు. మొక్కజొన్నను కోళ్లఫారాల్లో దాణాగా, పశు వుల ఫారాలు రోజురోజుకూ పెరుగుతుండడంతో మక్కలకు డిమాండ్ ఉంటుందని రైతులు భావిస్తున్నారు.



కొయ్య పద్దతిలో విత్తనాలు నాటుతున్న రైతులు

పక్షులు, జంతువుల సమస్యతో ఆందోళన

వరికి ప్రత్యామ్నాయంగా సాగుచేస్తున్న మొక్కజొన్న పంటకు పక్షులు, జంతువుల సమస్య అధికమయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ వాటి వల్ల ఎదు రయ్యే సమస్యలకు చెక్‌పెట్టే దిశగా రైతులు ప్రణా ళికతో ముందుకు సాగుతున్నారు. మొక్కజొన్న సాగు చేసే క్రమంలో పక్షులు, జంతువుల బారి నుంచి రక్షించుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నా రు. కోతులు, అడవి పందులు గుంపుగా వచ్చి పంటను నాశనం చేసే ప్రమాదం ఉంది. దీంతో రై తులు ముందస్తుగానే పచ్చికంకి దశలోనే అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారు.

కొయ్యపద్ధతితో ఖర్చు ఆదా

జున్ను కవిత, మహిళా రైతు, చల్‌గల్ గ్రామం



ప్రతీసారి ఒకే పంట సాగు చేయడం ద్వారా పంట దిగుబడి తగ్గే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆదాయం సైతం పడిపోతుంది. పంట మార్పిడి చేస్తే బాగుంటుందనే ఉద్దేశంతో వానాకాలంలో వరి సాగుచేసి, యాసంగిలో మొక్కజొన్న వేస్తున్నారు. పొలం దున్నకుండా కొయ్య పద్ధతిలో విత్తడంతో కొంత ఖర్చు తగ్గుతుంది.

పంట మార్పుతో లాభాలు అనేకం

- భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి, జగిత్యాల



పంటల మార్పిడితో దిగుబడులు పెరిగే అవకాశం ఉంది. తద్వార లాభాలు ఆర్జించవచ్చు. జిల్లాలో మొక్కజొన్న సాగుకు నేలలు అనుకూలంగా ఉన్నాయి. యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎకరాకు పంట దిగుబడి పెరిగే అవకాశం ఉన్నందున ఈ విషయాన్ని గమనించిన రైతులు మొక్కజొన్న వైపు దృష్టి సారిస్తున్నారు.

87మంది మందుబాబులకు జరిమానా, జైలు శిక్ష

వేములవాడ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 87మంది మందుబాబులకు జరిమానా, జైలుశిక్ష విధిస్తూ వేములవాడ జూనియర్ సివిల్‌జడ్జి జ్యోతిర్మయి శనివారం తీర్పుఇచ్చారు. ఇటీవల వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 87మంది మందుబాబులు పట్టుబడ్డారని, వారిని కోర్టులో హాజరుపరి చామని టౌన్‌సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వీరిలో 20మందికి ఒక్కొక్కరికి రూ.5వేల జరిమానా, మూడురోజుల జైలు శిక్ష, ఒకరికి రూ.3వేల జరిమానా, మూడు రోజుల జైలుశిక్ష, మరొకరికి రూ.3500 జరిమానా, మూడురోజుల జైలుశిక్ష, ఇద్దరికి రూ.5వేల జరిమానా, అయిదు రోజుల జైలుశిక్ష విధించారు. మరో 61మందికి ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానా, మరో ఇద్దరికి రూ.3500జరిమానా విధించారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మందు బాబులకు సీఐ, ట్రాఫిక్ ఎస్ఐ రాజు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి మద్యం తాగి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేయించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇబ్రహీంపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని జరిమానా విధించినట్లు తహసీల్దార్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మల్లాపూర్ మండలంలోని వాల్గొండ గ్రామం నుంచి మండలంలోని యామాపూర్‌కు ఇసుక తర లిస్తుండగా పట్టుకుని రూ.10 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

శిశువు విక్రయం కేసులో 16మంది అరెస్టు

● పరారీలో మరో ఇద్దరు

కరీంనగర్ క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పసికందును విక్రయించడానికి యత్నించిన ముఠాను కరీంనగర్ టూ టౌన్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ మేరకు టౌన్ ఏసీపీ వెంకటస్వామి మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్టణానికి చెందిన శీలం సాయిశ్రీ(22) అనే మహిళకు భర్తతో విబేధాలు వచ్చాయి. గర్భిణిగా ఉన్న ఆమె హైదరాబాద్‌కు రాగా స్నేహితులు అభినవ్, హీనా ఆశ్రయం కల్పించారు. ఈ నెల 14న సాయిశ్రీ గాంధీ ఆసుపత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. సాయిశ్రీ ఆర్థిక పరిస్థితిని ఆసరాగా చేసుకున్న అభినవ్, హీనా.. బిడ్డను పోషించడం కష్టమని, ఎవరికైనా అమ్మితే డబ్బులు వస్తాయని నమ్మించారు. ఇందుకు సాయిశ్రీ ఒప్పుకోవడంతో, హీనా తనకు తెలిసిన పల్లవి, భవాని అనే మధ్యవర్తుల ద్వారా కరీంనగర్‌లో బేరం కుదుర్చుకున్నారు. ఐదు లక్షల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్న ముఠా, 20న కారులో (అశోక్ అనే డ్రైవర్‌తో) కరీంనగర్ చేరుకున్నారు. భవాని సూచన మేరకు నగరంలోని ఆర్య ఆసుపత్రి వద్దకు వెళ్లి బిడ్డను కొనుగోలుదారులకు చూపించారు. అక్కడ డబ్బుల విషయంలో గొడవ జరగడం, అనుమానాస్పదంగా వ్యవహరించడాన్ని గమనించిన ఓ ఆటో డ్రైవర్ వెంటనే డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు అప్రమత్తం కావడంతో భయపడిన ముఠా అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించింది. కరీంనగర్ టూ టౌన్ పోలీసులు దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి శిశువును రక్షించి, ఐదు లక్షల రూపాయలు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శిశువు తల్లి సాయిశ్రీ, మధ్యవర్తులు హీనా, అభినవ్, భవాని, కారు డ్రైవర్ అశోక్ సహా 18 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ కేసులో 16 మంది నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించగా మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని సీఐ కె సృజన్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

● భర్తే హత్య చేశాడని బంధువులు, గ్రామస్థుల ఆరోపణ



సుకృత(ఫైల్)

సైదాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని రాములపల్లికి చెందిన చింతకుంట్ల సుకృత(45) అనే వివాహిత కాలిన గాయాలతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె భర్త మహిపాల్ రెడ్డి హత్య చేశాడని బంధువులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు, స్థానికులు, బంధువుల వివరాలప్రకారం.. చింతకుంట్ల మహిపాల్ రెడ్డికి సుకృత మొదటి భార్య. వారికి ఒక కూతురు జన్మించిన తరువాత కొన్ని రోజులకు సుకృతను మహిపాల్‌రెడ్డి దూరం పెడుతూ వచ్చాడు. కొంత కాలానికి ఇంకొక మహిళను వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి మహిపాల్‌రెడ్డి సుకృత మధ్య గొడవలు జరుగుతున్నాయి. పంచాయితీలు సైతం నిర్వహించారు. భూ పంపకాల విషయంలో విభేదాలు ఏర్పడి కేసులు కూడా పెట్టుకున్నారు. చివరకు గ్రామంలో పంచాయితీ నిర్వహించి మహిపాల్‌రెడ్డి వద్ద నుంచి సుకృతకు 20గుంటల భూమి ఇప్పించారు. సుకృత ఆ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ మిగతా సమయంలో కూలీకి వెళ్తూ కూతురిని చదివించి వివాహం చేసింది. ఇప్పుడు ఇంటి వద్ద ఒక్కతే ఉంటోంది. తనకు ఇచ్చిన 20గుంటల భూమిని సుకృత వేరే వాళ్లకు కౌలుకు ఇచ్చింది. దీంతో మహిపాల్ రెడ్డి కౌలుకు పట్టిన వ్యక్తిని బెదిరించాడు. చేసేది లేక ఆమె వ్యవసాయం చేసుకుంటున్నది. ఈ క్రమంలో శనివారం సుకృత వ్యవసాయ భూమి వద్దకు వెళ్లింది. అదే సమయంలో మహిపాల్ రెడ్డి అక్కడికి వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. సాయంత్రం వేళలో తన వ్యవసాయ భూమిలో సుకృత కాలిన గాయాలతో మృతిచెంది పడిఉంది. పక్కన పెట్రోల్‌బాటిల్ ఉండడంతో భర్త మహిపాల్ రెడ్డి భూ కక్షతోనే హత్య చేశాడని బంధువులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పోలీసులు విచారణలో పూర్తి వివరాలు తెలిసే అవకాశముంది.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి బలవన్మరణం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముగ్గురు ఆత్మహత్య చేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇందులో ఒకరు విద్యార్థి కాగా మిగితా రెండు ఘటనల్లో ఒకరు యువకుడు, మరొకరు వృద్ధురాలు.. వివరాల్లోకి వెళితే..

తండ్రి మరణం తట్టుకోలేక.. ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



అభిరాం(ఫైల్)

కోరుట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనంద్ నగర్ చెందిన సాంబారి అభిరాం(17) అనే ఇంటర్‌విద్యార్థి శనివారం ఉరి వేసుకొని అత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సాంబారి అభిరాం కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గత సంవత్సరం అభిరాం తన అన్న ఆదిత్య, తండ్రి శ్యాంసుదర్‌తో కలిసి మల్లాపూర్ మండలం మొగిపలిపేటలోని గోదావరి నదిలో స్నానానికి వెళ్లారు. స్నానానికి వెళ్లిన తండ్రి పిల్లల ముందే గోదావరి నదిలో మునిగి మృతి చెందాడు. అప్పడినుంచి అభిరాం తండ్రి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉండేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలం చేరుకొని పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి బలవన్మరణం

శంకరపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం అంబాలాపూర్‌లో పురుగుల మందు తాగి శనివారం ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. అంబాలాపూర్‌కు చెందిన వీరగోని నరేష్(35) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో కుటుంబంలో కలహాలు తలెత్తడంతో మనస్తాపానికి గురయ్యాడు. శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నరేష్ తండ్రి వీరగోని కొంరయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

ఉరి వేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

కరీంనగర్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం లక్ష్మీపూర్‌లో ఉసికె ఎల్లయ్య(62) శుక్రవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులవివరాల ప్రకారం.. ఎల్లయ్య భార్య 3నెలల కిందట అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటినుంచి మానసికంగా బాధపడుతూ ఇంటి వద్ద ఉంటున్నాడు. వారి కొడుకు రాంనగర్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మానసిక ఆందోళనతో ఎల్లయ్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని కొడుకు శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న టిప్పర్

బోయినపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామ శనివారం జరిగింది. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... గంగాధర మండలం ఓద్యారం గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన బాలసంకుల గిరిధర్ తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెంకట్రావుపల్లి గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద తాతేరావు భగత్ అనే డ్రైవర్ టిప్పర్‌ను అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని వెనక వైపు నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గిరిధర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు సోదరుడు లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్ ఎత్తుకెళ్ళిన దొంగలు

కరీంనగర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బహదూర్ ఖాన్‌పేటలో బుర్ర కుమార స్వామి, ఆకుల రవి, గుర్రం రవి పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. ఉదయం పొలం వద్దకు వచ్చి చూసే సరికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మన్‌ను కరెంటు పోల్‌నుంచి దొంగిలించి అందులో నుంచి కాపర్‌వైర్‌ను దొంగిలించినట్లు రైతులు తెలిపారు. ఈ విషయాన్ని మొగ్దుంపూర్ ఎఈకి ఎల్‌యం రాజుకు తెలిపారు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసి దొంగిలించిన వ్యక్తులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీతో.. మరణ ధ్రువీకరణ పత్రం జారీ

● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఎంపీడీవో

బీర్‌పూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మరణ ధ్రువీకరణ పత్రంపై తన సంతకం ఫోర్జరీ చేశారని తంగూర్ కార్యదర్శి కె మల్లికార్జున్ శనివారం బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో భీమేష్ ఒక ప్రకనటలో తెలిపారు. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన యశోదరాజన్న 2022అక్టోబరు 5వ తేదీన ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాజన్న మరణం గ్రామపంచాయతీ రికార్డుల్లో నమోదు కాలేదు. అయినా రికార్డులో నమోదైనట్టు సంతకం ఫోర్జరీ చేసి 2024జనవరి 28వ తేదీన కొల్వాయి మీ సేవాకేంద్రం ద్వారా సర్టిఫికెట్ జారీ చేశారు. విషయం తెలుసుకున్న కార్యదర్శి మల్లికార్జున్ మీ సేవ కేంద్రంపై బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు..

బోయినపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వడ్ల లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ డ్రైవరు వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి విద్యుత్‌లైన్‌ను ధ్వంసం చేసిన సంఘటనలో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు బోయినపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. కోరం గ్రామంలో ఈనెల 15వడ్లు లోడుతో వెళ్తున్న లారీని డ్రైవర్ వినోద్ తిరాజ్ వాహనాన్ని జాగ్రత్తగా నడుపుతూ విద్యుత్‌లైన్‌ను తగిలించాడు. ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన ఎల్‌టి లైన్ దెబ్బతిని మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దెబ్బతిన్న స్తంభాల విలువ సుమారు రూ.45000 రూపాయలు. సెస్ ఏఈ గడపక ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంతర్రాష్ట్ర సైబర్ మోసగాడి అరెస్టు

● ఇన్‌స్టాగ్రామ్‌లో నిరుద్యోగుల వివరాలు సేకరించి దుబాయ్ పంపిస్తానని మోసం
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్



వివరాలు వెల్లడిస్తున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలరూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నిరుద్యోగుల వివరాలను సేకరించి దుబాయ్ పంపిస్తానని మోసం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ ప్రాంతానికి చెందిన డానియల్ కెవిన్ ఎడ్విన్ అనే సైబర్ మోసగాడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శనివారం జగిత్యాల రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సారంగాపూర్ మండలానికి చెందిన నవీన్ అనే నిరుద్యోగి వివరాలను డానయల్ కెవిన్ కెడ్విన్ సేకరించాడు. అనంతరం ఫోన్ చేసి దుబాయ్ పంపిస్తానని నవీన్‌ను నమ్మించాడు. దీంతో నవీన్ దుబాయ్ వెళ్లేందుకు డానియల్ కెవిన్ ఎడ్విన్‌కు బ్యాంక్ ద్వారా విడతలవారీగా 8,40,000 రూపాయలను పంపించాడు. ఎన్ని రోజులు గడిచినా ఉద్యోగం రాక పోవడంతో మోసపోయానని గ్రహించిన నవీన్ సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీలు రఘుచందర్, వెంకరటమణ ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ చేపట్టారు. నిందితుడిని సారంగాపూర్ మండలంలోని కోనాపూర్ శివారులో జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ తన సిబ్బందితో కలిసి శనివారం పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, జమ్ముకాశ్మీర్ రాష్ట్రాలకు చెందిన సుమారు ఐదుగురు వ్యక్తులను సైతం నిందితుడు మోసం చేశాడని డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి మొబైల్‌ఫోన్స్, క్రెడిట్‌కార్డు డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకున్న జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై గీత, పోలీసుసిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

మానేరులో నదిలో కుంగిన చెక్ డ్యామ్



గుంపుల మానేరులో కుంగిన చెక్ డ్యామ్

ఓదెల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంపుల మానేరు నదిలోని చెక్‌డ్యాం శుక్రవారం కుంగిపోయింది. మానేరు పరివాహక ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి, సాగునీటికి కొరత లేకుండా ఉండేందుకు 2023లో రూ.23.52కోట్ల వ్యయంతో చెక్‌డ్యామ్ నిర్మించారు. అప్పటినుంచి మానేరు వాగులో నీటి నిలువ ఉండడంతో పరిసరాల ప్రాంతాల్లో సాగు, తాగునీటి ఇబ్బందులు లేవు. అలాగే ఇక్కడి రామభద్ర ఆలయానికి వచ్చే భక్తులు కూడా వాగునీరు స్నానాలకు అను కూలంగా ఉండేది. శుక్రవారం రాత్రిడ్యాం కుంగి పోవడంతో చెక్‌డ్యాంలోని నీరంతా దిగువ పోయింది. కూలిపోయిందనే సమాచారం తెలుసుకున్న మాజీఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చెక్ డ్యాం వద్దకు వెళ్లి పరిశీలించారు. పొత్కపల్లి పోలీసులతో పాటు ఇరిగేషన్ అధికారులు సంఘటన వద్దకు వచ్చి పరిశీలించారు. యాసంగి పంటకు సాగునీటి కొరతవచ్చే పరిస్థితులు ఉన్నాయని మానేరు పరివాహక గ్రామాలప్రజలు తెలిపారు. ఈ సంఘటనవల్ల గుంపులతోపాటు జమ్మికుంట మండలం తనుగుల గ్రామాలప్రజలకు ఇబ్బందులు కలగనున్నాయి. చెక్‌డ్యాం కుంగిపోవడంపై ఉన్నతస్థాయి అధికారులు విచారణ చేస్తే తప్పనిజాలు బయటికి వచ్చే పరిస్థితులు కనబడడంలేదు. అయితే నాణ్యత లోపమా, ఇసుక మాఫియా లేదా గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా డిటో నేటర్లతో పేల్చివేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్టీసీ బస్సు ఆపలేదని మహిళ ఆగ్రహం

● 3 కిలోమీటర్ల దూరం ఓ వ్యక్తి బైక్‌పై వెళ్లి బస్సు అడ్డగింత ● డ్రైవర్‌తో వాగ్వాదం
● పోలీస్ స్టేషన్ ఎదుట గొడవ - ఇరువురిని శాంతింపజేసిన పోలీసులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఆపలేదని ఓ మహిళ ఆగ్రహించింది. ఓ వ్యక్తి బైక్‌పై వెళ్లి మూడు కిలోమీటర్ల దూరం వెంబడించి బస్సును అడ్డుకుంది. డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగింది. ఈ సంఘటన వీర్నపల్లి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. మహిళ, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన మహిళ సంతోషి సిరిసిల్ల వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు కోసం వేచి చూస్తోంది. సిరిసిల్ల ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు వన్‌పల్లి నుంచి సిరిసిల్ల వైపు వెళుతోంది. మహిళ సంతోషి నిలబడిన చోట డ్రైవర్ బస్సును ఆపకుండా ముందుకు సాగాడు. దీంతో ఆగ్రహించిన మహిళ అక్కడే ఉన్న ఓ వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనంపై ఆర్టీసీ బస్సును మూడు కిలోమీటర్ల దూరం వరకు వెంబడించింది. వీర్నపల్లి గ్రామ శివారులో ఆర్టీసి బస్సును ఆమె అడ్డుకుంది. బస్సులోకి ఎక్కి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగింది. బస్సు ఎందుకు ఆపలేదని మండిపడింది. డ్రైవర్, మహిళ గొడవకు దిగడాన్ని చూసిన ప్రయాణికులు నివ్వెరపోయారు. ఇరువర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొనడం వల్ల డ్రైవర్ బస్సును నేరుగా వీర్నపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లాడు. ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు డ్రైవర్, మహిళ సంతోషికి నచ్చజెప్పేందుకు యత్నించినా ఆమె వినిపించుకోలేదు. సదరు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. చివరికి ఇద్దరిని శాంతింపజేయడంతో సమస్య సద్దుమణిగింది.



గొడవకు దిగిన మహిళకు నచ్చజెపుతున్న ఎస్ఐ లక్ష్మణ్

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు అంబారిపేట విద్యార్థిని



కప్ అందుకున్న శరణ్యతో ఫిజికల్ డైరెక్టర్

కథలాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్లలో జరిగిన అండర్ 17 విభాగం ఖోఖో జిల్లా స్థాయి పోటీల్లో అంబారిపేట ఉన్నత పాఠశాలకు చెందిన చింత శరణ్య ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ రాజేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో శరణ్య పాల్గొంటుందని పీడీ చెప్పారు.

ఆర్‌జీపీఆర్ఎస్ జాతీయ కన్వీనర్‌గా రాజేష్ కాశిపాక



రాజేష్ కాశిపాక

కరీంనగర్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కరీంనగర్‌కు చెందిన రాజేష్ కాశిపాకను 'రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్'(ఆర్‌జీపీఆర్ఎస్) జాతీయ కన్వీనర్‌గా నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. రాజేష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల బలోపేతమే లక్ష్యంగా పనిచేసేందుకు తనకు అవకాశం కల్పించనందుకు కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు.

సేవా సైనికులు



- క్రమశిక్షణ, ఏకత.. ఎన్‌సీసీ నినాదం
- నేడు ఎన్‌సీసీ దినోత్సవం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖాకీ యూనిఫామ్‌తో సామాజిక సేవలో పాలుపంచుకుంటూ క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తోంది జాతీయ యువ సైనిక దళం (నేషనల్ కేడెట్ కార్ప్స్). ఓర్పు, నేర్పు, క్రమశిక్షణ, దేశభక్తి, సేవాతత్పరత, చెరగని చిరునవ్వు, గుండె నిండా ధైర్యం, ఆపదలో ఆపన్న హస్తం అందించే హృదయం.. ఇవన్నీ ఓ సైనికుడికి ఉండాల్సిన లక్షణాలు. ఈ సుగుణాల కలబోతే ఎన్‌సీసీ కెడెట్లు. క్రమశిక్షణ, ఏకత నినాదంతో 1948లో నెహ్రూ కలలకు రూపంగా ప్రారంభించిన నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) చెందుతూ నేడు 22 లక్షల యువతకు శిక్షణ ఇస్తోంది. క్రమశిక్షణ, దేశభక్తి గల యువతను నిర్మించే గురుతర బాధ్యతను పోషిస్తున్నది. పాఠశాల బాలబాలికలకు, కళాశాలల యువతీ, యువకులకు నిరంతరం క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం గల రేపటి పౌరులను తీర్చిదిద్దుతున్నది ఎన్‌సీసీ. ప్రతి సంవత్సరం నవంబరు నెలలో నాలుగో ఆదివారం రోజు ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహిస్తారు.



గార్డ్ ఆఫ్ హానర్‌లో పాల్గొంటున్న ఎన్‌సీసీ కేడెట్లు



ఆర్‌డి పరేడ్‌లో పాల్గొన్న మహిళా డిగ్రీ కళాశాల కేడెట్లు

ఎన్‌సీసీ ప్రధాన లక్ష్యం...

దేశంలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించి, వారిని దేశం సేవకు సిద్ధం చేయడం ఎన్‌సీసీ ముఖ్య లక్ష్యం. ఎన్‌సీసీలో ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ అనే విభాగాలు ఉన్నాయి. ఇవి విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణను అందిస్తాయి. ఎన్‌సీసీ నినాదం ఐక్యత, క్రమశిక్షణ. ఈ సంస్థ రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఎన్‌సీసీ కేడెట్లకు పలు అంశాల్లో శిక్షణ ఇస్తారు.

శిబిరాల నిర్వహణ.

శిక్షణలో భాగంగా బెటాలియన్ స్థాయి, ఎన్‌సీసీ గ్రూపు స్థాయి, డైరెక్టరేట్ రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో శిబిరాలు నిర్వహిస్తారు. ఈ శిబిరాల ద్వారా కేడెట్లకు క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు అలవడుతాయి. ఇవేకాకుండా రిపబ్లిక్ దినోత్సవ శిబిరం, జాతీయ సమైక్యత, తలసేన, అటాచ్‌మెంట్, ట్రెక్కింగ్, సంయుక్త వార్షిక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ సికింద్రాబాద్ కేంద్రంగా పని చేస్తుంది. ఇందులో తొమ్మిది గ్రూపులు ఉన్నాయి. నిజామాబాద్ కేంద్రంగా ఉన్న ఎన్‌సీసీ గ్రూపు పరిధిలో కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ బెటాలియన్లు ఉన్నాయి.

జీవితంలో మరిచిపోలేనివి అనుభవం



- యు మనీషా, ఎన్‌సీసీ కేడెట్

ఎన్‌సీసీ శిక్షణ పొందడం ద్వారా జీవితంలో మరిచిపోలేని ఎన్నో అనుభవాలను పొందాను. దేశంలో ని పలు ప్రాంతాల్లో నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరాల్లో పాల్గొన్నాను. సైనికులతో కలిసి సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించాను. సాహస శిబిరాల్లో పాలొన్నాను.

సామాజిక సేవలో తృప్తి...



- డి మనూష, ఎన్‌సీసీ కేడెట్

ఎన్‌సీసీ శిక్షణ ఎంతో కఠినమైనది. కానీ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, రక్తదానాలు చేయడం ఎంతో సంతృప్తిగా ఉంది. కళాశాలలో ఎన్‌సీసీ కేడెట్‌గా నాకంటూ ఓ గుర్తింపు లభించింది.

గ్రామానికి రోడ్డు వేయాలని రాస్తారోకో



పొత్తూరు వంతెనపై రాస్తారోకో చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తూరు గ్రామం వరకు బీటీ రోడ్డు వేయాలని కోరుతూ గ్రామస్థులు శనివారం రాస్తారోకో చేపట్టారు. గ్రామ సమీపంలోని వంతెన వద్దకు శనివారం చేరుకున్న గ్రామస్థులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గుండ్లపల్లె నుంచి పొత్తూరు వరకు డబుల్‌రోడ్డు మంజూరైందన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రెండు సంవత్సరాల కాలంలో గన్నేరువరం వరకు మాత్రమే రోడ్డు వేస్తామని పేర్కొనడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి పొత్తూరు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పట్నం అశ్విని‌శ్రీనివాస్, నాయకులు గుంటి ఆంజనేయులు, బండారి మహేష్, రొండ్ల కరుణాకర్‌రెడ్డి, పట్నం మహేందర్, తోడేటి సతీష్, తిరుమల్, అభి ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మ

గంగాధర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండల మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గంగాధరలో మాట్లాడుతూ 23 నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించనున్న అండర్-17ఖోఖో పోటీలకు శ్రీహర్షిని, సాహితి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

భీమేశ్వరాలయంలో వైభవంగా పల్లకీ సేవ



భీమేశ్వరాలయంలో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరాలయంలో శనివారం పల్లకీ సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో భక్తుల మొక్కుబడి కోసం పల్లకీ సేవలను ప్రతి రోజు సాయంత్రం 6.30గంటల వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సేవల్లో భాగంగా భీమేశ్వరాలయంలో పార్వతీ, రాజరాజేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవిసహిత అనంత పద్మనాభస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయితే భక్తులు రద్దీగా ఉండే ఆది, సోమవారం రోజుల్లో సేవలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు ఈ పల్లకీ సేవలను వినియోగించుకునేందుకు ఏర్పా ట్లు చేశారు. ఈ సేవల్లో ఆలయ పర్య వేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఆలయ అర్చ కులు, వేదపండితులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం శనివారం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షిం చారు. వైజంక్షన్, ఘాట్‌రోడ్డు ప్రాంతంలో వాహనాల రద్దీ నెలకొంది.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం పురస్కరించుకొని ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు గోదావరిలో స్నానాలు చేసి ఆలయాలకు చేరుకున్నారు. అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్యకల్యాణం జరిపించి పూజలు చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు. ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముత్యంపేట్ నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

మెట్‌పల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముత్యంపేట్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం సిగ్గు చేటన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు దీనిపై స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ రైతులను మోసం చేయడం సిగ్గు చేటన్నారు. ఇక్కడి రైతులు వంద కిలోమీటర్ల దూరంలో కామారెడ్డి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకును తరలిస్తూ ఆర్థిక భారం, ప్రయాణ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీని తెరిపించే వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతుల రవాణా ఖర్చులు భరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలో పలు రాష్ట్రాల్లో మూతపడిన దాదాపు 200 షుగర్ ఫ్యాక్టరీలను తెరపించడం జరిగిందన్నారు. రాష్ట్రప్రభుత్వం చేతకాని తనవల్లనే రైతులకు ఇబ్బందులు వస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాస్తే మూతపడ్డ మూడు షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించే బాధ్యత బీజేపీ తీసుకుంటుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు, రాష్ట్ర నాయకులు రఘు, అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఏలేటి నరేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, బీజేవైఎం రాష్ట్రకార్యవర్గ సభ్యులు దోనికెల నవీన్, పార్లమెంట్ కోకన్వీనర్ గుంటుక సదాశివ్, బీజేపీ జిల్లా కార్యదర్శి వీసు రాజేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తుకారం గౌడ్, ఇల్లెందుల శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శులు సుంకేటి విజయ్, పట్టణ కార్యదర్శి బొడ్ల ఆనంద్, ఎర్ర రాజేందర్, చెట్లపల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

యూనిటీ మార్చ్‌కి చిన్నపాపయ్యపల్లివాసి ఎంపిక



నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి

హుజూరాబాద్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం దేశమంతటా నిర్వహిస్తున్న యూనిటీ మార్చ్‌కు హుజూరాబాద్ మండలం చిన్న పాపయ్యపల్లికి చెందిన నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శనివారం ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 23న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రారంభం కానున్న యూనిటీ మార్చ్ నాగపూర్, ఇండోర్ మీదుగా గుజరాత్‌లోని ఐక్యతా విగ్రహం వద్ద ముగుస్తుందన్నారు. జిల్లా నుంచి తనను ఎంపిక చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కరీంనగర్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో పనిచేస్తున్న పీజీటీ ఇంగ్లీష్ టీచర్ వొల్లాల శ్రీనివాస్ శుక్రవారం 10వ తరగతి విద్యార్థి బదావత్ సంజీవ్(15)ను చితకబాదగా విద్యార్థి చేయి విరిగింది. ఈ మేరకు విద్యార్థి తండ్రి బదావత్ రాజె కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టీచర్ శ్రీనివాస్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ, విద్యార్థి దండ్రి ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం... పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం బ్రాహ్మనపల్లి లంబాడి తండాకు చెందిన విద్యార్థి బదావత్ సంజీవ్ 15 రోజుల క్రితం ఆరోగ్యం బాగా లేనందున ఇంటికి వెళ్లి చికిత్స అనంతరం ఈ నెల 19న తిరిగి తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ హాస్టల్‌లో చేరాడు. శుక్రవారం ఉదయం నోట్స్ ఎందుకు రాయలేదని టీచర్ శ్రీనివాస్ అడుగుతూ విద్యార్థిని స్టాఫ్‌రూంకు పిలిచి అక్కడ మరో ఇద్దరు టీచర్ల సమక్షంలోనే చెంపపై కొట్టాడు, అనంతరం ప్రిన్సిపల్ రూంకు విద్యార్థిని తీసుకువెళ్లి ప్రిన్సిపల్ వీర్ల మహేష్, అటెండర్ ఎండీ జావిద్ సమక్షంలో వీపుభాగంలో మోచేతితో కొట్టాడని, లంబాడోళ్లు చదవరురా అంటూ కొడుతుంటే అటెండర్ ఆపబోగా వినిపించుకోకుండా కొట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మరో టీచర్ విద్యార్థిని ఆసుపత్రికి తీసుకువెళ్లి డాక్టర్‌కు చూపించగా కుడిభుజంలో ఫ్రాక్చర్ అయినట్లు వెల్లడైందని విద్యార్థి తండ్రి పోలీసులకు తెలిపాడు.

టీచర్ శ్రీనివాస్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నా మని సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

కూలీ మృతి

కరీంనగర్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యానగర్‌లో నివాసం ఉంటున్న నక్క సతీష్(45) అనే కూలీ పనికి వెళ్లి కొత్తపల్లి మండలం బద్దిపెల్లిలో హటాత్తుగా మరణించాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ఛాతిలో నొప్పి వస్తుందని స్థానికులతో అంటూ కిందపడిపోయి మృతి చెందాడని తెలిపారు. ఇల్లందకుంట మండలం టేకుర్తి గ్రామానికి చెందిన నక్క సతీష్ విద్యానగర్‌లో భార్య పిల్లలతో కలిసి ఉంటుండగా భార్య ఒక హాస్టల్‌లో పని చేస్తుండగా మృతుడు కూలీగా పని చేస్తుంటాడని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

లేబర్‌కోడ్‌ల అమలుకు బీఎంఎస్ మద్దతు

భగత్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ల అమలును బీఎంఎస్ స్వా గతిస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు పవ్వుల సురేష్ అన్నారు. శనివారం నగరంలోని బీఎంఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక రంగానికి ఇది చారిత్రాతమకమైన రోజు అన్నారు. భారతదేశంలో ఇంత పెద్ద కార్మిక సవ రణ ఇదే మొదటి సారి అన్నారు. కోడ్ అమలు కారణంగా దేశ వ్యాప్తంగా కార్మిక వర్గానికి సామాజిక భద్రతతో పాటు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పసుల ప్రవణ్, నాయకులు నక్క అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో గురుకుల విద్యార్థులకు బంగారు పతకాలు

మానకొండూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్‌లోని గురుకుల విద్యార్థులు జాతీయ స్థాయి యోగాలో బంగారు పతకాలు సాధించారు. పాఠశాలకు చెందిన పురాణం దీపక్ పంజాబ్, అస్సాం, హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీల్లో ప్రథమ స్థానం సాధించాడు. తీట్ల హర్షిత్ బాలాజీ హిమాచల్ ప్రదేశ్, తమిళనాడులో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో ప్రథమ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం విద్యార్థులను అభినందించారు. పీఈటీలు శివప్రసాద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ దక్షిణ ప్రాకారం కూల్చివేత

వేగంగా విస్తరణ పనులు



వేములవాడ రాజన్న ఆలయంలో దక్షిణప్రాకారం వద్ద పనులు

వేములవాడ టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే ఆలయ పాత కట్టడాలు తొలగించేశారు. ఇక ఆలయం చుట్టూ ఉన్న ప్రాకారం కూల్చివేత పనులు సాగుతున్నాయి. ఇందులో భాగంగానే ఆలయ దక్షిణం వైపు ఉన్న ప్రాకారాన్ని చెన్నై నుంచి తెప్పించిన భారీ హైడ్రాలిక్ రిగ్ మిషన్‌తో కూల్చివేస్తున్నారు. ప్రధాన రహదారిని భారీరేకులతో మూసివేసి ప్రాకారం కూల్చివేత పనులు కొనసాగిస్తున్నారు. కాగా, దక్షిణ ప్రాకారాన్ని పాత రహదారిని కలుపుకొని నిర్మించేందుకు అంచనా వేశారు. ఇందుకు ఆర్‌అండ్‌బీ, ఆలయ ఇంజనీరింగ్ అధికారులు శనివారం మార్కింగ్ ఇచ్చారు. విస్తరణ వల్ల బ్రాహ్మణుల ఇళ్లు, దుకాణాలు కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటివరకు ఆ ప్రాంతం వైపు ఉన్న ఇళ్ల యజమానులకు ఎలాంటి నోటీసులు జారీకాలేదు. ఇందుకు దుకాణాలు, ఇళ్ల యజమానుల్లో ఆందోళన నెలకొంది.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం నీరు రావడం స్వల్పంగా తగ్గింది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 1,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీ కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 457 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండు కుండలా ఉంది. ప్రాజెక్టులోకి ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 947.590 టీఎంసీల నీరు వచ్చి చేరగా, 879.877 టీఎంసీలు దిగువకు వదిలారు.

డిసెంబరులో రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చాట్ల శ్రీధర్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబరు 13, 14 తేదీల్లో కరీంనగర్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షులు డాక్టర్ చాట్ల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి నీలం లక్ష్మణ్ అన్నారు. శనివారం కరీంనగర్ ఐఎంఏ హాల్‌లో పలువురు అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. గతంలో 2014 సంవత్సరంలో రాష్ట్ర స్థాయి పోటీలను ఘనంగా నిర్వహించామని గుర్తు చేశారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు, అధికారులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయనున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి నీలం లక్ష్మణ్, కోశాధికారి కుడాల సురేష్ కుమార్, ఉపాధ్యక్షులు పెంచాల కిషన్‌రావు, రాజిరెడ్డి, వెంకటేష్, మహేందర్, మన్సూర్, ప్రభాకర్, పద్మ, రాధా, అమర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం

గణేశ్‌నగర్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీలకు 42 రిజర్వేషన్ల సాధన కోసం డిసెంబర్ 10,11,12,. నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమన్ని విజయవంతం చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్. బొల్లం లింగమూర్తి పటేల్ పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాకి బీసీలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. విద్య ఉద్యోగ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ చేర్చాలని అన్నారు. భారతదేశంలో బీసీ కులాల లెక్కలు లేకపోవడం వలన దేశంలో 63 శాతం ఉన్న బీసీ కులాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. సామాజికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాలలో బీసీ కులాల వారు తీవ్రంగా అణచివేతకు గురవుతున్నారు. దేశంలో బీసీలకు ఒక న్యాయం, ఇతర వర్గాలకు ఒక న్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెంట అజయ్ పటేల్. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తౌటం సత్యం. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ కాల్వ మధుబాబు ఉన్నారు.

పంచాయతీలకు నజరానా..

(5వ పేజీ తరువాయి)

ఎన్నికలు జరగగా ఫిబ్రవరి 2న పాలకవర్గాలు ప్రమాణ స్వీకారం చేశాయి. ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10లక్షలు మాత్రం అందకుండానే పాలకవర్గాలు ముగిసి 20నెలలు గడిచిపోయింది. ఆర్థిక సంఘం నిధులతోనే పంచాయతీ పాలకవర్గాలు అభివృద్ధి పనులను నెట్టుకువచ్చారు. ఆర్థిక సంఘం నిధులు నేరుగా గ్రామ పంచాయతీలకు చేరుతున్నా వాటిని ఖర్చు పెట్టుకోవడానికి నిబంధనలు ఉన్నాయి. కనీసం ప్రోత్సాహక నిధులైనా వస్తే ప్రజలకు అవసరమైన పనులు చేయవచ్చని పాలకవర్గాలు భావించినా నిధులు మాత్రం రాలేదు.

● ఏకగ్రీవ పంచాయతీలు ఇవే..

జిల్లాలో 2019లో 255 గ్రామపంచాయతీలు ఉండగా, 253 గ్రామపంచాయతీలకు మూడు విడతలుగా నిర్వహించిన ఎన్నికల్లో 41 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. ఏకగ్రీవ పంచాయతీల్లో బోయినపల్లి మండలంలో కోరెం, చందుర్తి మండలంలో దేవునితండా, కట్టలింగంపేట, కొత్తపేట, ఇల్లంతకుంట మండలంలో చిక్కుడువానిపల్లె, గుండెపల్లి, కిష్టారావుపల్లి, పెద్దలింగాపూర్, రామోజీపేట, సోమారంపేట, గంభీరావుపేట మండలంలో లక్ష్మీపూర్, రాజుపేట, పొన్నాలపల్లి, కోనరావుపేట మండలంలో అజ్మీర తండా, గోవిందరావుపేట తండా, జై సేవాలాల్ భూక్య తండా, జై సేవాలాల్ ఊరు తండా, కమ్మరిపేట తండా, ముస్తాబాద్ మండలంలో గన్నవానిపల్లె, రుద్రంగి మండలంలో అడ్డబోరు తండా, బడితండా, చింతమాని తండా, డేగావత్ తండా, రూపులానాయక్‌తండా, సర్పంచ్ తండా, వీరునితండా, తంగళ్లపల్లి మండలంలో చింతల్‌ఠాణా, నర్సింహులపల్లె, వీర్నపల్లి మండలంలో మద్దిమల్ల తండా బాబాయి చెరువుతండా, భూక్య తండా, లాల్‌సింగ్ తండా, శాంతినగర్, ఎర్రగడ్డతండా, వేములవాడ రూరల్ మండలంలో తుర్కాశినగర్, ఎల్లారెడ్డిపేట మండలంలో బుగ్గ రాజేశ్వర్ తండా, గుంటపల్లి చెరువు తండా, దేవుని గుట్ట తండా, అగ్రహారం, హరిదాస్‌నగర్, గ్రామపంచాయతీలు పూర్తి పాలకవర్గంతో సహా ఏకగ్రీవమై ప్రోత్సాహానికి అర్హతగా నిలిచాయి. ఏకగ్రీవ గ్రామపంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే నిధులతో పాటు మంత్రి కేటీఆర్ తన నియోజకవర్గ నిధుల నుంచి రూ15లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కేటీఆర్ పంచాయతీలకు వివిధ రకాలుగా నిధులు సమకూర్చారు. కానీ ప్రోత్సాహక నిధులు మాత్రం రాలేదు. మరోసారి ఏకగ్రీవ పంచాయతీల ప్రోత్సాహక అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చింది.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, నవంబరు22(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను స్థానిక సత్యసాయి సేవా సంస్థ సభ్యులు శనివారం అందజేశారు. అంతకు ముందు రాచర్లబొప్పాపూర్‌లోని సేవా మందిరంలో బాల వికాస్ ఆధ్వర్యంలోని విద్యార్థులు ప్రత్యేక భజనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం..

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ, ఇన్‌చార్జి కలెక్టర్



బోయినపల్లిలో చీరలు పంపిణీ చేస్తున్న ఎమెల్యే సత్యం, ఇన్‌చార్జి కలెక్టర్

ఇల్లంతకుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహిళల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి ఇందిరా మహిళాశక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రతి పథకం అమలులో మహిళలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోదన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్‌రెడ్డి, డీఆర్డీఓ శేషాద్రి, ఏఎమ్‌సీ వైస్‌చైర్మన్ ప్రసాద్, మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళ, ఏపీఎం లతామంగేశ్వరి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డిలతో పాటు అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

అర్హులందరికీ చీరలు పంపిణీ..

బోయినపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతిమహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. బోయినపల్లి రైతు వేదికలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా వారు హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలుచేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముదిగంటి సురేందర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ వేసిరెడ్డి దుర్గారెడ్డి, డీఆర్డీవో శేషాద్రి, తహసీల్దార్ నారాయణ రెడ్డి, ఎంపీడీవో జయశీల, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, కార్యదర్శి జంగం అంజయ్య, మండలకాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, నాగుల వంశీ, మాజీ సర్పంచ్ సంబ లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం అధికారులు నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో స్నిగ్ధరెడ్డి, ఏపీఎం సరస్వతి, పంచాయతీ కార్యదర్శి అభిలాష్, కాంగ్రెస్ నాయకులు కచ్చకాయల బాల్‌రెడ్డి, నీరటి సంజీవ్, సుంకరి రెడ్డి, బుర్ర జ్యోతి, రమేష్, ఉప్పుల గంగయ్య, బాధవేణి బాలరాజు, నీరటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండలం బండపల్లి గ్రామపంచాయతీలో శనివారం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ కట్కం మల్లేశం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అన్నాడి వినోద, ఎండి అజీమ్, అక్కనపల్లి నర్సయ్య, ముస్కు మల్లారెడ్డి, గడ్డం నికిత, తీపిరెడ్డి కర్ణాకర్, వివేలు కవిత, అనురాధ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం వితరణ

తంగళ్లపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ముద్దం బుచ్చవ్వ ఇటీవల మృతి చెందింది. శనివారం తంగళ్లపల్లి మాజీ సర్పంచ్ అంకారపు రవీందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం అందించారు. కందుకూరి రామగౌడ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఫ్లవర్స్ డే..

తంగళ్లపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సరస్వతి శుభోదయ స్కూల్‌లో శనివారం ఫ్లవర్స్ డే జరుపుకున్నారు. కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్, ప్రిన్సిపాల్ మాధవి లతరెడ్డి, ప్రైమరి ఇన్‌చార్జీ పద్మశ్రీ, స్రవంతి, సరిత, కీర్తన, శిరీష, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు

- అడిషనల్ కలెక్టర్ గడ్డం నగేశ్



గోరంటాలలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఎల్లారెడ్డిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో జాప్యం తగదని, రైతుల వద్ద నుంచి కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ గడ్డం నగేశ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లతిమ్మాపూర్, రాచర్లబొప్పాపూర్, కిషన్‌దాస్‌పేట, రాగట్లపల్లి, పదిర, వెంకటాపూర్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు. కేంద్రాల్లోని వసతులపై ఆరా తీశారు. ధాన్యం కొనుగోలు, రైతుల వివరాలు, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాలకు తీసుకు వచ్చిన ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం వహించకూడదని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలని అడిషనల్ కలెక్టర్ నగేశ్ పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సుజాత, సంబంధిత శాఖ అధికారులు ఉన్నారు.

● గంభీరావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్, గజసింగవరం, గోరంటాల, గంభీరావుపేట, ముస్తాఫనగర్, లింగన్నపేట గ్రామాల్లో వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శనివారం పరిశీలించారు. దాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వసతులను ఆయన పరిశీలించి, ఏమైన సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. దాన్యం కొనుగోళ్ళకు సంబంధించి గన్ని సంచులు, లారీల సమస్య లేకుండా చూడాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. పరిశీలనలో తహసీల్దార్ మారుతిరెడ్డి తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శి నిధుల దుర్వినియోగం..?

- రాజీనామా చేసి మరో ఉద్యోగంలో చేరిక

తంగళ్లపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు చర్చించుకుంటున్నారు. గ్రామ పంచాయతీకి చెందిన పలు పన్నులు వసులు చేసి ప్రభుత్వ ఖాతాలో జమ చేయకుండానే ఇష్టానుసారంగా ఖర్చు చేసి తప్పుడు లెక్కలు రాసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు రూ.6లక్షల వరకు పన్నులు వసూళు చేసి అందులో సుమారు 40శాతం డబ్బులు దుర్వినియోగమైనట్లు చర్చించుకుంటున్నారు. పంచాయతీ కార్యదర్శికి మరో శాఖలో ఉద్యోగం రావడంతో సంబంధిత డబ్బుల లెక్కలు అధికారులు చూపకుండానే రిజన్ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఎంపీడీవోను వివరణ కోరగా మరో ఉద్యోగం రావడంతో రిజైన్ చేసినట్లు తెలిపారు. డబ్బుల దుర్వినియోగం తమ దృష్టికి రాలేదని రికార్డులు పరిశీలించి డబ్బులు దుర్వినియోగం ఐతే రికవరీ చేస్తామని చెప్పారు. మండలంలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

బోయినపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బోయినపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను ఇంచార్జి కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో ఆహార సామగ్రి, కోడి గుడ్లు, కూరగాయలు పరిశీలించారు. విద్యాలయంలో విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఏమైనా ఇబ్బందులుంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. బోయినపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది హాజరు, ఓపీ, మందుల రిజిస్టర్, వ్యాక్సిన్ గది, మందులు ఇచ్చే గదిని పరిశీలించారు. దవాఖానలో అందుతున్న వైద్య సేవలపై రోగుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

పీహెచ్‌సీ తనిఖీ..

తంగళ్లపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి రజిత తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వ్యాధి నిరోధక టీకాల రిజిస్టర్లను పరిశీలించారు. చిన్నపిల్లల తల్లిదండ్రులకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్నేహ ఉన్నారు.

వేములవాడ అర్బన్ మండలం సర్పంచ్ రిజర్వేషన్లు ఖరారు

వేములవాడ టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వేములవాడ అర్బన్ మండలంలోని 11గ్రామాల సర్పంచ్‌ల రిజర్వేషన్‌లను శనివారం ఎంపీడీవో ప్రకటించారు. వేములవాడ అర్బన్ మండలంలోని ఆరెపల్లి, శభాష్‌పల్లి, కొడుముంజ(జనరల్), సంకెపల్లి-బీసీ జనరల్, రుద్రవరం-జనరల్ మహిళ, అనుపురం- ఎస్సీ మహిళ, చింతలఠాణ- ఎస్సీ జనరల్, మారుపాక- ఎస్సీ జనరల్, గుర్రవానిపల్లి- జనరల్ మహిళ, చంద్రగిరి - బీసీ మహిళ, చీర్లవంచ - జనరల్ మహిళకు రిజర్వు అయ్యాయి.

నిర్వాసితులకు అన్యాయం చేయవద్దు

వేములవాడ టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):వేములవాడ పట్టణంలోని ఆంధ్రబ్యాంక్ రహదారి నిర్వాసితులకు అన్యాయం చేయవద్దని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. ఆంధ్రాబ్యాంకు రహదారిని ఆలయవిస్తరణ కోసం తీసుకుంటున్నారని, ఆవైపు ఉన్న ఇళ్లు, దుకాణాల యజమానులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజలను ఒప్పించి పనులు చేపట్టాలన్నారు.

గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు

తంగళ్లపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరెళ్ల బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రికరెడ్డి, వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించారు. పలువురికి మందులు పంపిణీ చేశారు.

● కోనరావుపేట : మండలంలోని మరిమడ్ల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు వైద్యాధికారి వేణుమాధవ్ శనివారం పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ రషీద్, సిబ్బంది అరుణ్, చందు తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

-ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం అని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలోనీ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి పేరిట ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల నిర్మాణం పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. చిన్నారులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. రుద్రంగి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో నటరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్ జలపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగా నరసయ్య, గడ్డం శ్రీని వాస్ రెడ్డి, గండి నారాయణ, పల్లి గంగాధర్, మాడిశెట్టి అభిలాష్, కేశిరెడ్డి నర్సారెడ్డి, తర్రె లింగం, ఎర్రం రాజలిం గం, కట్కూరి దాసు, ఎర్రం అరవింద్, దయ్యాల శీను, పోగుల మహేష్, సూర యాదయ్య, చేలుకల శ్రీకాంత్, తదిత రులు పాల్గొన్నారు.

కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పర్శరాములు



దీక్ష చేస్తున్న నాయకులు

చందుర్తి నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శ రాములు అన్నారు. మండల కేంద్రంలో బీసీ హక్కుల కోసం ఒకరోజు న్యాయ సాధన దీక్షను సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యాకల పర్శరాములు మాట్లాడుతూ బీసీలకు దక్కాల్సిన న్యాయం ఇప్పటికీ అర్థం తరంగా ఉందన్నారు. విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో తమ వాటా తమకు రావాలన్నారు. రాజ్యాంగ హక్కులు అమలయ్యే వరకు వెనక్కి తగ్గమని స్పష్టం చేశారు. సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు అమర బండ ప్రసాద్, కోరుట్ల రమేష్, వనపర్తి సతీష్, బొరిగే ప్రసాద్, నర్సయ్య తదితరులున్నారు.

సెస్ పరిధిలో నిరంతరం విద్యుత్ సరఫరా

తంగళ్లపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సెస్ పరిధిలోని వినియోగదారులకు నిరంతరం విద్యుత్ అందిస్తున్నామని సెస్ చైర్మన్ చిక్కాల రామారావ్ అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్ గ్రామ శివారులో రూ.2.50లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఏడు కొత్త విద్యుత్తు స్తంబాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ను సెస్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ వినియోగదారులు బకాయిలు చెల్లించి సంస్థకు సహకరించాలని కోరారు. సెస్ ఏఈ మధుకర్, మాజీ సర్పంచ్ వలకొండ వేణుగోపాల్‌రావు, మాజీ ఎంపీటీపీ జంగిటి అంజయ్య పాల్గొన్నారు.

● అసిస్టెంట్ హెల్పర్లకు సెస్ సంస్థ అనుకూలంగా ఉందని సెస్ చైర్మన్ చిక్కాల రామరావ్ అన్నారు. అసిస్టెంట్ హెల్పర్లుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభు త్వం స్పందించాల్సి ఉందన్నారు.

గోవిందరాజ స్వామి సేవలో ప్రభుత్వ విప్

చందుర్తి నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలోని సనుగుల గోవిందరాజ స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించి ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ సభ్యుడు కుమార్, నాయకులు ధర్మపురి శ్రీనివాస్, ముకుంద రెడ్డి, రాంచంద్రం, సాయి, అనిల్, తదితరులు ఉన్నారు.

దుప్పట్ల పంపిణీ

చందుర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమకూర్చిన దుప్పట్లను చందుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు పార్టీ నాయకులు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మ్యాకల ఎల్లయ్య, కేడీసీసీ డైరెక్టర్ జలగం కిషన్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, నాయకులు చిలుక అంజిబాబు, భైరగోని రమేష్, ఎండి ఇస్మాయిల్, దుమ్మ ఆనందు, మ్యాకల పర్షరాములు, పోతరాజు నగేష్, తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహంలోని పేద విద్యార్థులకు గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా పేద విద్యార్థులకు చలికాలం దుప్పట్లు బీఆర్‌ఎస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం, మాజీ ఎంపీపీ గంగం స్వరూపమహేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, కంటి రెడ్డి, చెప్యాల గణేష్, ఉప్పులూటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో వెంకటాపూర్ శివారులోని ఓ మౌజయః ప్రజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యుడు లక్ష్మీకాంతం, పంచాయతీ కార్యదర్శి రమేశ్, కేంద్రం ప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు ఉద్యమించాలి

ముస్తాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల సాధనకు బీసీ వర్గాలన్నీ ఒకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని బీసీ జేఏసీ కన్వీనర్ తోట ధర్మేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకు బీసీ సామాజిక వర్గాలు ఒక్కటి కావాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే 42 శాతం రిజర్వేషన్‌ను సాధించాలని కోరారు.

నిరుపేదలకు, చీరలు దుప్పట్లు పంపిణీ

ముస్తాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుర్కపల్లె గ్రామంలో పేదలకు చీరలను, దుప్పట్లను శనివారం పంపిణీ చేశారు. పారిశ్రామితకవేత్త చిట్నేని వెంకటేశ్వర్‌రావు, మాధవి దంపతులు తుర్కపల్లెలోని 15 మంది నిరుపేదలకు చీరలను, 15 మంది వృద్ధులకు దుప్పట్లను అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాశోల్ల పద్మదుర్గప్రసాద్, కార్యదర్శి పర్శరాములు, విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు.

పదిర శివారులో చెత్త తొలగింపు

-‘ఆంధ్రజ్యోతి’ కథనానికి స్పందన



అధికారులు తొలగించిన చెత్తకుప్ప

ఎల్లారెడ్డిపేట, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గ్రామశివారులోని వాగు ప్రాంతం డంపింగ్ యార్డును తలపించింది. చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు కంపోస్టు షెడ్డు నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. చెత్తచెదారం, కంపోస్టు షెడ్డుపై లోపించిన పర్యవేక్షణతో ప్రజలు, రైతులు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 22న ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన ‘పల్లెల్లో చెత్తశుద్ధిపై పట్టింపేదీ..?’ కథనానికి పంచాయతీ కార్యదర్శి సారిక శనివారం స్పందించారు. గ్రామంలోని వాగు ప్రాంతంలో గుట్టలా మారిన చెత్తకుప్పను ట్రాక్టర్ సహాయంతో తొలగించారు. పరిసరాలను శుభ్రం చేయించారు. కంపోస్టు షెడ్డును పరిశీలించి సేంద్రియ ఎరువు తయారుకు చర్యలు చేపట్టారు. గ్రామంలో చెత్తచెదారం తొలగడం, కంపోస్టు షెడ్డు వినియోగంలోకి రావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రమాదకర గొయ్యికి మరమ్మతులు

- ‘ఆంధ్రజ్యోతి’ కథనానికి స్పందన

ఎల్లారెడ్డిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 8వ వార్డులోని మురుగు నీటి కాల్వస్లాబ్‌పై గొయ్యి ఏర్పడడంతో కాలనీవాసులు ప్రమాదాలకు గురయ్యారు. కాలనీవాసులు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై ఇటీవల ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన ‘ప్రమాదకరంగా గొయ్యి.. పొంచి ఉన్న ముప్పు’ కథనానికి పంచాయతీకార్యదర్శి ప్రవీణ్‌కుమార్ శనివారం స్పందించారు. మురుగునీటి కాల్వను పరిశీలించారు. తేలిన ఇనుప చువ్వలను తొలగించారు. కాల్వపై స్లాబ్‌కు మరమ్మత్తు పనులను చేయించారు. మురుగు నీటి కాల్వపై స్లాబ్ మరమ్మత్తు పనులు చేయడంతో కాలనీవాసులు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గంభీరావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్తాఫనగర్‌లో దోమకొండ ప్రశాంత్ ఇటీవల దుబాయిలో మృతిచెందగా కుటుంబాన్ని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు శనివారం పరామర్శించారు. అదేగ్రామంలో ఆరీఫ్ గుండెపోటుతో మృతిచెందగా ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, ముస్తాఫనగర్ గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సింగరావు, నాయకులు బండ రమేష్, మల్లేశం, శివరాత్రి నర్సయ్య, తిరుపతి, హన్మయ్య, మీనయ్య తదితరులు ఉన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ జనజాగరణ అభియాన్ ప్రారంభం

వేములవాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో ఆర్‌ఎస్‌ఎస్ జనజాగరణ అభియాన్‌ను నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబా భవాని ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం స్వయం సేవకులు ఇంటింటికి వెళ్లి జన జాగరణ కార్యక్రమాన్ని కొనసాగించారు. సంఘ్ నాయకులు కోపల్ల రాజన్న, కోనం పుల్లరెడ్డి, విశ్వహిందు పరిషత్ నాయకులు గడప కిషోర్‌రావు, బీజేపి పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, నాయకులు కట్కం శ్రీనివాస్, బిల్ల కృష్ణహరి, శ్రీనివాస్, వాసం మల్లేశం తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడిని కేటాయించాలని వినతి

ఇల్లంతకుంట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోటిమీదిపల్లె గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడిని కేటాయించాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. మండలకేంద్రంలోని రైతువేదికకు చీరల పంపిణీ కార్యక్రమానికి శనివారం ఎమ్మెల్యే రాగా మహిళలు పాఠశాల సమస్యలు విన్నవించి వెంటనే పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్థులు తెలిపారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్యాయాదవ్ మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ దృష్టికి తీసుకవచ్చారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన..

తంగళ్లపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం రామన్నపల్లె, అంకుసాపూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార అధికారి రామకృష్ణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో, నిర్వహకులతో మాట్లడారు. రైతులు ఇబ్బందులు పడకుండా త్వరగా వరిధాన్యాన్ని రైస్‌మిల్లులకు పంపించాలన్నారు.

మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి ప్రభుత్వం కృషి

- జిల్లా మత్స్య శాఖాధికారి సౌజన్య



చేపపిల్లలను అందజేస్తున్న జిల్లా మత్స్య శాఖాధికారి సౌజన్య

తంగళ్లపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని జిల్లా మత్స్యశాఖాధికారి సౌజన్య అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులోని బొంగరంకుంటలో జిల్లా అధికారి చేప పిల్లలను వదిలారు. సందర్భంగా మాట్లడుతూ జిల్లాలో అన్ని చెరువులు, కుంటల్లో చేపపిల్లలను వదులుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, పంచాయతీ కార్యదర్శి సమీర్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రమాద బీమా ప్రీమియం డబ్బులు చెల్లిస్తానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ వెంకటాపూర్‌లోని ఆటో డ్రైవర్లు శనివారం ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆటోడ్రైవర్లు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండల కేంద్రంలో ఆటోడ్రైవర్లు కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకుడు బొల్లి రాంమోహన్, ఆటో డ్రైవర్లు సంతోషం తదితరులు పాల్గొన్నారు.